ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 6మే 2024 | 3





జయం మనదే..

ఓడిపోతామని తెలిసే వైసీపీ దాడులు

- కల్తీకి కేరాఫ్‌గా మారిన మంత్రి
- మట్టి, ఇసుక మాఫియాకు రాజా
- హేచరీకి రూ.10 లక్షల మామూళ్లు
- విలేకరిని హత్య చేయించారు
- రానున్నది కూటమి ప్రభుత్వమే
- జనసంద్రంగా మారిన తుని



ఫ్యాన్ గాలి తీసేయండి : సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

తుని రూరల్, మే 5 : కల్తీకి కేరాఫ్‌గా మారిన ఘనత తునికి చెందిన వైసీపీ మంత్రి దాడిశెట్టి రాజాకే దక్కిందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శించారు. కూటమి ఉమ్మడి అభ్యర్థుల ప్రచారంలో భాగంగా తుని పట్టణం గొల్ల అప్పారావు సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని, ఓడిపోతామని తెలిసే వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్యలకు మంత్రి దాడిశెట్టి రాజా పాల్పడ్డారని, పత్రికా స్వేచ్ఛను హరించి ఓ పత్రికా విలేకరిని దారుణంగా హత్య చేయించారన్నారు. తాండవ నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వి తరలించి సముద్ర తీరాన సముద్రపు ఇసుకను కలిపి కల్తీ ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. తీర ప్రాంతాల్లో రాష్ట్రానికి ఆదాయ వనరులుగా మారిన హేచరీల నుంచి రూ.10 లక్షలు మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సాగునీటి కాల్వలు గాలికి వదిలేసి రైతులను దెబ్బతీశారని ధ్వజమెత్తారు.తునిలో ప్రధాన సమస్య తాండవ రిటైనింగ్ వాల్ ఊసే లేదని, మట్టి మాఫియా నడిపిస్తూ కోట్ల రూపాయలు దండుకోవడమే మంత్రి పనిగా పెట్టుకున్నారన్నారు. మంత్రి ఇలాకాలోనే రోడ్లు దయనీయంగా మారాయని, మిగతాచోట్ల పరిస్థితి చెప్పనక్కరలేదన్నారు. తునిలో సమస్యలు పరిష్కారం అవ్వాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్న దివీస్ పరిశ్రమ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, మత్స్యకారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. దివీస్ సమస్యపై గతంలో తొండంగి మండలంలో పర్యటించి వారికి అండగా నిలిచినట్టు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాలుష్య రహిత పరిశ్రమల పనిపడతామన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం అభివృద్ధి చేస్తామన్నారు. పంపా, తాండవ రిజర్వాయర్లకు సంబంధించిన పంట కాల్వలు ఆధునికీకరించి రైతులను ఆదుకుంటామన్నారు. తుని రైల్వేస్టేషన్‌లో లోకల్ ట్రైన్స్ హాల్ట్‌కు చొరవ చూపి ఈ ప్రాంత వాసుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తుని అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటామని రానున్న ఎన్నికల్లో సైకిల్, గాజు గ్లాసు గుర్తులపై అమూల్యమైన ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంట సంక్షేమం వెల్లివిరుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. ముందుగా చామవరం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభ వేదిక వరకూ రోడ్ నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, తుని అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత, సుర్ల లోవరాజు, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, మోతుకూరి వెంకటేష్, యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధువీరేష్, చోడిశెట్టి గణేష్, బీజేపీ నేత చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొన్నారు.



వీరికే ఓటేయండి : కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్, తుని ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితను పరిచయం చేస్తున్న పవన్



పవన్‌ను కలిసిన ముద్రగడ కుమార్తె

తుని రూరల్ : తునిలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి, చందు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పవన్‌కల్యాణ్‌పై ముద్రగడ పద్మనాభం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జనసేనానికి మద్దతుగా మాట్లాడిన విషయం విదితమే. దీంతో వీరి కలయిక చర్చనీయాంశమైంది.



పవర్ స్టార్.. ప్రభంజనం : తునిలో జరిగిన పవన్ సభకు హాజరైన యువత

నేడు ప్రధాని మోదీ రాక

- రాజమహేంద్రవరం వేమగిరిలో కూటమి భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న పవన్, పురందేశ్వరి, లోకేశ్
- వేదిక, ఇతర ఏర్పాట్లు పూర్తి
- భారీ భద్రతా ఏర్పాట్లు



వేమగిరిలో మోదీ పాల్గొనే సభా వేదిక ఏర్పాట్లు


రాజమహేంద్రవరం, మే5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. ఎన్‌డీఏ కూటమి భాగస్వాములుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ హాజరుకానున్నారు. 'విజయశంఖారావం' పేరుతో నిర్వహించే ఈ సభ 60 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. విశాలమైన సభావేదికలు ఏర్పాటు చేశారు. హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపం వరకూ హైవేకు రెండువైపులా బారికేడ్లు ఏర్పాటుచేశారు. వేమగిరి వైపు కూడా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసు భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తం ఈ ప్రాంతాన్ని ఎస్‌పీజీ స్వాధీనం చేసుకుంది. ప్రాంగణంలో 50 వేల మంది కూర్చోవడానికి కుర్చీలు వేస్తున్నారు. ప్రధానమంత్రి పాల్గొనే ఈ విజయశంఖారావం సభ వేదికపై మొత్తం 44 మంది ఆశీనులయ్యేటట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితోపాటు కాకినాడ, అమలాపురం, నర్సాపురం, ఏలూరు పార్లమెంటు అభ్యర్థులకు కూడా స్థానం కల్పించనున్నారు. వారితోపాటు ముఖ్యంగా రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులకు చోటు కల్పించనున్నారు. ఇంకా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ముఖ్య నేతలకు కూడా అవకాశం కల్పిస్తారు.

ప్రధాని రాక ఇలా..

ప్రధాని నరేంద్రమోదీ సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట 35 నిమిషాలకు ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ ఎయిర్‌పోర్టు నుంచి ఐఏఎఫ్ ఎంబ్రేయర్ మీద బయలుదేరి 2.25 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.30 గంటలకు ఎం.ఐ 17 హెలికాప్టర్ మీద 2.50 గంటలకు వేమగిరిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు వస్తారు. అక్కడ నుంచి 2.55 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3 గంటలకు సభావేదిక వద్దకు వస్తారు. అక్కడ 3 గంటల నుంచి 3.45 గంటల వరకూ అంటే మొత్తం 45 నిమిషాలపాటు వేదిక మీద ఉంటారు. 3.45కు బయలుదేరి రోడ్డు మార్గాన 3.55 గంటలకు హెలిపాడ్‌కు చేరుకుంటారు. హెలికాప్టర్‌లో అనకాపల్లి వెళతారు.

గాలి వీస్తోంది!

కూటమి వైపే 'గోదారి' పవనాలు



- అధినేతల చూపంతా ఇక్కడే
- గోదావరి జిల్లాలను జల్లెడ పడుతున్న పార్టీలు
- రోజూ ఏదొక అధినేత ఈ జిల్లాల్లోనే పర్యటన
- టీడీపీ అధినేత చంద్రబాబు సుడిగాలి పర్యటనలు.. దూకుడు పెంచేలా వ్యూహాలు
- జనసేన అధినేత సైతం ఉమ్మడి జిల్లాపైనే దృష్టి
- అన్ని నియోజకవర్గాలనూ చుట్టేస్తున్న పవన్
- పిఠాపురంలో బరిలోనూ 'వారాహి' స్పీడు
- రాజమండ్రి ఎంపీ బరి నుంచి పురందేశ్వరి
- రాష్ట్ర అధ్యక్షురాలిగానూ దిశానిర్దేశం
- కూటమి అభ్యర్థుల జోరుతో వైసీపీ డీలా
- ఇప్పటికే జగన్ పర్యటించినా కలసిరాని వైనం
- మోదీ సభతో ఇక 'విజయశంఖారావమే'

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు అనూహ్యమైన తీర్పు ఇవ్వబోతున్నట్టు గోదావరి తీరంలోని జనంనాడి చెబుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైపు గాలి వీస్తుండడంతో ఆయా పార్టీల్లో జోష్ పెరిగింది. 2019లో ఇక్కడ వైసీపీ ఫ్యాన్ గాలితో దూసుకెళ్లింది. ఈసారి గోదావరిలో సహజమైన గాలి వీస్తోంది. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అస్తవ్యస్థ విధానాలు, అవినీతి, అరాచకం, శాంతిభద్రతలు మృగ్యంకావడం, వేధింపు ధోరణులు, ప్రకృతి వనరుల దోపిడీ.. అభివృద్ధి లేకపోవడం, నిరుద్యోగం.. ఇలా సవాలక్ష సమస్యల్లో జనం చిక్కుకుపోయారు. అసలు పథకాలన్నీ మూలనపడేసి, కొన్ని సంక్షేమాల పథకాల పేరిట బటన్ నొక్కినా, అవి ప్రజలకు ఎప్పుడు చేరతాయో కూడా తెలియని గందరగోళం మధ్య ఐదేళ్లు గడిచింది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి.. సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం కూడా దుర్భరమైన స్థితిని చవిచూశారు. కరెంటు చార్జీలు, పన్నుల పేరిట సాగించిన ప్రభుత్వం అన్ని వర్గాలపై ఎనలేని భారం మోపింది. నరకప్రాయమైన రోడ్లు, అభివృద్ధి లేమితో ప్రజలు పడినపాట్లు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలో అభివృద్ధి అనేది ఎక్కడా ప్రచారం చేసుకోలేని దుస్థితిలో వైసీపీ ఉంది. ఈసారి సంక్షేమం అనే ఒక్క మాటనే పదేపదే వల్లెవేస్తూ జగన్ బటన్ నొక్కిన కార్యక్రమాన్ని ప్రచారం చేస్తోంది. మరోవైపు ఆ పార్టీ మేనిఫెస్టో కూడా తుస్సుమనడంతో కేడర్ మరింత డీలా పడింది. ఇటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి గోదావరి జిల్లాల్లో జనం బ్రహ్మరథం పడుతుండడం వైసీపీ నేతల్లో వణుకుపుట్టిస్తోంది. శాంతిభద్రతలు కాపాడడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన ప్రజామేనిఫెస్టోను కూటమి విడుదల చేయడంతో మంచి స్పందన వచ్చింది. మరోవైపు టీడీపీకి కంచుకోటలాంటి గోదావరి జిల్లాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మొదటి నుంచి ప్రత్యేక దృష్టి పెట్టారు. వైసీపీ కుట్ర వల్ల చంద్రబాబు 53 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా మగ్గిపోయిన సమయంలో ఆయన కుటుంబ సభ్యులంతా రాజమహేంద్రవరంలోనే మకాం ఉండి ప్రజలతో కలసి ఉండిపోయారు. చంద్రబాబుకు ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభించడంతోపాటు ఆయన గొప్పతనం ప్రజలకు బాగా అర్థమైంది. అంతకుముందే గత ఏడాది మే నెలలో రాష్ట్ర స్థాయి టీడీపీ మహానాడును ఇక్కడే నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలనూ ఇక్కడి నుంచే ప్రకటించారు. మహానాడు కూడా గోదావరి జిల్లాల్లో మరింత జోష్‌ను పెంచింది. టీడీపీ-జనసేన పొత్తు కూడా రాజమహేంద్రవరంలోనే పొడవడం, నేరుగా పవన్‌కల్యాణ్ ఇక్కడి నుంచే ప్రకటించడమేగాకుండా తొలి భేటీ కూడా ఇక్కడే నిర్వహించడం రాజకీయ సంచలనాలకు దారితీసిందనే చెప్పాలి. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు గోదావరి జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నికల ప్రకటన తర్వాత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రధానంగా గోదావరి జిల్లాలపైనే దృష్టి పెట్టారు. గోదావరి జిల్లాల్లో గాలి ఎటుంటే అదే పార్టీ అధికారంలోకి వస్తుందనేది ఎన్నోసార్లు రుజువైంది. దీంతో గోదావరి జిల్లాల్లో గెలుపే ప్రధానంగా ఇటు కూటమి, అటు వైసీపీ కూడా సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్నాయి. ప్రతిరోజూ ఏదొక అధినేత గోదావరి జిల్లాల్లో పర్యటిస్తుండడమే దీనికి ఉదాహరణ. సీట్ల కేటాయింపులో టీడీపీ, జనసేన మధ్య కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడినా.. ఊహించని విధంగా ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఈ రెండు పార్టీల కేడర్లు ఎంతో పట్టుదలగా కలసి పనిచేస్తున్నాయి. గత ఎన్నికల్లో జనసేన కూడా గోదావరి జిల్లాల్లో గణనీయమైన ఓటుబ్యాంకును సాధించుకోవడంతో ఇప్పుడు కూటమికి మరింత బలం చేకూరిందని టీడీపీ, జనసేన అభ్యర్థులు గణాంకాలతో సహా చెబుతున్నారు. మరో రెండు ఆసక్తికరమైన అంశాలు ఏమంటే.. రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ, జనసేన అధినేతలు పురందేశ్వరి, పవన్‌కల్యాణ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే పోటీ చేస్తుండడం ఈ ప్రాంతంలో ప్రభావితం చూపుతుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా పిఠాపురం నుంచి పోటీచేస్తున్న పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గంతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరిని ప్రభావితం చేసేలా పూర్తిస్థాయిలో తన పర్యటనలను రూపొందించుకోవడం వ్యూహాత్మకమే. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్.. గోదావరి జిల్లాల ఫలితాలను పూర్తి స్థాయిలో ప్రభావితం చేసేలా ఎన్నికల ప్రచారాలను సాగిస్తున్నారని ఆ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విజయావకాశాలపైనా అందరి దృష్టి ఉంది. ఆమె తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులతో కలసి పెద్దఎత్తున ప్రచారం సాగిస్తూ విజయానికి చేరువవుతున్నారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగానూ ఇక్కడి నుంచే దిశానిర్దేశం చేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా రాజకీయ ఉద్దండులంతా గోదావరి జిల్లాలపై పూర్తిగా దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది. వైసీపీ అధినేత జగన్ కూడా ఎక్కువసార్లు గోదావరి జిల్లాల్లో పర్యటించే విధంగానే తన రూటు మ్యాప్‌ను రూపొందించుకుంటున్నారు. బస్సు యాత్ర ద్వారా, తర్వాత అంబాజీపేటలో ఎన్నికల ప్రచారానికి ఇప్పటిదాకా రాగా, ఆయా జగన్ సభలు అనుకున్నవిధంగా విజయవంతంకాకపోవడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 7న కోరుకొండలో ఎన్నికల ప్రచారసభ కోసం మరోసారి జగన్ రాబోతున్నారు. మొత్తానికి వైసీపీ గోదావరి జిల్లాల్లో ఈసారి వ్యతిరేక పవనాలు వీస్తుండడం వైసీపీ అభ్యర్థులను కలవరానికి గురిచేస్తోంది. ఎన్‌డీఏ కూటమి తరఫున ప్రచారానికి సోమవారం రాజహేంద్రవరం వస్తున్న ప్రధాని మోదీ విజయశంఖారావం పూరించి.. దూకుడు పెంచనున్నారు.

రేపు కోరుకొండలో సీఎం జగన్ పర్యటన 5

హీరో సాయిధరమ్ తేజ్‌పై పిఠాపురంలో దాడి - మెయిన్‌లో..



అమలాపురంలో ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుని ఉత్సాహంగా బయటికి వచ్చిన ఉద్యోగులు

తొలిరోజు 59.61 శాతం

- జిల్లాలోని ఏడు ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న పీవోలు, ఏపీవోలు, ఇతర సిబ్బంది
- అత్యధికంగా అమలాపురంలో 78.02 శాతం
- అత్యల్పంగా కొత్తపేటలో 42.55 శాతం పోలింగ్

... వివరాలు 5లో

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు

రావులపాలెం, మే 5: అన్ని వర్గాలను సంక్షేమ పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాటుపడతానని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం మండలంలోని ముమ్మిడివరప్పాడు, గోపాలపురం గ్రామాల్లో ఆదివారం ఆయన ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇస్తూ బండారు గెలుపును కాంక్షిస్తూ పువ్వులు వేస్తూ స్వాగతం పలికారు. యువతులు బండారుతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. ముమ్మిడివరప్పాడులో సూపర్ సిక్స్ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ అరాచక పాలనలో కుంటుపడిన అభివృద్ధిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి చేస్తామన్నారు. గోపాలపురంలో సత్యానందరావుతో పాటు జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ ప్రచారంలో పాల్గొన్నారు. బండారును పూలమాలతో సత్కరించారు. ప్రచార రథంపై పర్యటించిన బండారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. సైకో పాలనలో వెనుకబడిన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. మారుమూల ప్రాంతాలతో పాటు ప్రధాన గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. రహదా రులు, డ్రైనేజీలు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తానన్నారు. తనను గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించాలన్నారు. ప్రచారంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముమ్మిడివరప్పాడులో కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి సత్యానందరావుతో సెల్ఫీ దిగుతున్న యువతులు



గోపాలపురంలో ప్రచార రథంపై నుంచి ఓట్లు అభ్యర్థిస్తున్న బండారు సత్యానందరావు



ముమ్మిడివరప్పాడులో సత్యానందరావుకు హారతి ఇస్తున్న మహిళ

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
సోమవారం 6 మే 2024 4

మహిళలపై నేరాల నియంత్రణకు

ప్రత్యేకంగా రాజమండ్రి రక్షాదళం

డిక్లరేషన్ ఆవిష్కరించిన పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు



డిక్లరేషన్ ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి, వాసు, నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మే 5: మహిళలపై నేరాల నియంత్రణకు సంబంధించి మేనిఫెస్టోలో ప్రత్యేకంగా రూపొందించిన రాజమండ్రి రక్షాదళం డిక్లరేషన్‌ను బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, తెలుగుదేశం పార్టీ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఆవిష్కరించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో ఈ మేరకు డిక్లరేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ మహిళల రక్షణ తమ బాధ్యత అని అన్నారు. వైసీపీ పాలనలో మహిళలపై అత్యాచారాలు, దాడులు ఎక్కువయ్యాయని చెప్పారు. రాజమహేంద్రవరం సిటీలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను పెంచి పోషిస్తున్నది ఎవరో అందరికీ తెలుసని అన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పాలన మారితేనే అరాచకాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, నేరాల నియంత్రణలో భాగంగా దశలవారీగా సిటీలో 7,500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎక్కువగా నేరాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా రాజమండ్రి రక్షాదళం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు ఆదిరెడ్డి అప్పారావు, సోము వీర్రాజు, టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, జనసేన నాయకుడు అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నగర ఇన్‌చార్జి యెనుముల రంగబాబు, రేలంగి శ్రీదేవి, మాజీ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణ, వీరన్న చౌదరి, ఇతర నాయకులు పాల్గొన్నారు. పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు రాజమహేంద్రవరం సిటీలోని రాజస్థానీలు, గుజరాతీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



ఇంద్రభవనాన్ని తలపిస్తున్న వైసీపీ కార్యాలయం





స్థలాలు చూపకపోవడంతో గుడారాల్లోనే పేదల నివాసం

వైసీపీ కోసం

ఇంద్రభవనం

జనాలకు మాత్రం జగనన్న గుడారాలు

రాజమహేంద్రవరంలో వైసీపీ కార్యాలయం రాజ భవనమే..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి): పై ఫొటోలో మీరు చూస్తోంది మహారాజుల ప్యాలెస్ కాదు. వైసీపీ పార్టీ కార్యాలయం. రెండో ఫొటోలో చూస్తోంది ఎడారిలో డేరాలు కాదు.. సిటీలో పేదల గుడారాలు. వైసీపీ పాలనలో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందనడానికి ఇవే ప్రత్యక్ష సాక్ష్యాలు. జగనన్న కాలనీల పేరిట పేదవర్గాల్లో ఎన్నో ఆశలు పుట్టించారు. ఎందుకూ పనికిరాని భూముల్లోను, నివాస ప్రాంతాలకు కిలోమీటర్ల దూరంలోనూ కొందరికి స్థలాలిచ్చారు. ఈ ఐదేళ్లలో ఆ భూముల్లో పేదల ఇళ్లకు పునాదులు కూడా పడలేదు. కానీ చాలామందికి పట్టాలు తప్ప స్థలం కేటాయించిందీ లేదు. పేదల ఇళ్ల కోసం స్థలాల సేకరణ అంటూ వందల కోట్ల రూపాయలు మాత్రం వైసీపీ నాయకులు జేబులో వేసుకున్నారు. ఇక అసలు విషయానికొస్తే.. ఇటీవల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు తూర్పుగోదావరిలోని రాజమండ్రి అర్బన్, రూరల్‌లోని పేదలకు రాజానగరం నియోజకవర్గంలోని పలు మండలాల్లో స్థలాలను కేటాయించామంటూ వైసీపీ నాయకులు ఆర్భాటంగా పట్టాలు పంపిణీ చేశారు. అయితే చేతిలో పట్టా పెట్టారేగానీ ఈరోజుకీ స్థలాలు చూపించలేదు. దీంతో పేదలు గుడారాల్లోనే మగ్గిపోతున్నారు. స్థానిక క్వారీ మార్కెట్ ఏరియాలోని పేదలకు రెండు నెలల కిందట ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కానీ వారికి ఈనాటికీ స్థలాలు చూపించలేదు. వాళ్లకు ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత కూడా లేకపోవడంతో ఖాళీ స్థలాల్లోకి వెళ్లినా మళ్లీ గుడారాల బతుకులేనంటూ ఆ పేదలు వాపోతున్నారు.

- ఐదేళ్ల నుంచీ పేదలకు గూడు కల్పించలేని వైసీపీ పాలకులు తమ పార్టీ కార్యాలయాలకు మాత్రం ఇంద్రభవనాలు నిర్మించుకుంటున్నారు. పేదలకు ఇళ్ల తర్వాత సంగతి.. ప్రతి జిల్లాకు ఇంద్రభవనంలా పార్టీ కార్యాలయం నిర్మించాలనే జగన్ ఆలోచనతో తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని వైసీపీ.. తమ పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని రూ.2 కోట్ల అంచనా వ్యయంతో కేవలం మూడు నెలల కిందట ప్రారంభించారు. సుమారు రెండు ఎకరాల ఆర్అండ్‌బీ స్థలంలో శరవేగంగా 90 శాతం పనులు పూర్తిచేశారు. ఈ స్థలం రాజమహేంద్రవరంలో అత్యంత ఖరీదైన ప్రాంతమైన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, ఆర్ట్స్ కళాశాల చెంతన ఉంది. ఇక్కడ బహిరంగ మార్కెట్లో గజం లక్షపైనే ఉంది.. ఎకరం రూ.50 కోట్ల దాకా ఉంటుంది. అంటే రూ.100 కోట్లు ఉంటుంది. నామమాత్ర లీజు ప్రాతిపదికన కేబినెట్‌లో ఆమోదం పొంది ఈ నిర్మాణం చేస్తున్నారు. పక్కనే ఆర్ట్స్ కాలేజీలో హెలిప్యాడ్ కూడా అందుబాటులో ఉండేలా ఈ భవన నిర్మాణ స్థలాన్ని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఐదేళ్లలో పేదల సొంతింటి కల తీర్చడం చేతగాని జగన్.. పార్టీకి మాత్రం కోట్లు ఖర్చుపెట్టి ప్యాలెస్‌ని కట్టుకున్నారంటూ జనం నివ్వెరపోతున్నారు.



నేమ్ బోర్డు బహూకరణ

ఆయన పేరు దాట్ల బాబు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కూటమి అభ్యర్థులకు ముందస్తుగానే ఎంపీ, ఎమ్మెల్యే నేమ్ బోర్డులను అందజేశారు. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు ఎంపీ నేమ్‌బోర్డు, ఎమ్మెల్యే అభ్యర్థులు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, దాట్ల సుబ్బరాజు, వాసంశెట్టి సుభాష్‌లకు ఎమ్మెల్యే నేమ్ బోర్డులు అందజేశారు. వారంతా గెలవడం ఖాయమని తన నమ్మకమని ఆయన చెబుతున్నారు.

– అమలాపురం టౌన్



జానీ మాస్టర్ ప్రచారం

అంబాజీపేట, మే 5: ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రముఖ సినీ డ్యాన్స్ మాస్టర్ జానీ మాస్టర్ అన్నారు. పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల ప్రచారంలో స్టార్ క్యాంపెయినర్‌గా ఆయన పాల్గొని గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జానీ మాస్టర్‌తో ఫొటోలు తీసుకునేందుకు కూటమి శ్రేణులు ఉత్సాహం కనబరిచారు.

ఓటర్లలో వారిదే పైచేయి..పోటీలో మాత్రం వెనుకంజ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇదీ పరిస్థితి

ఏడు అసెంబ్లీ స్థానాలకు బరిలో ఎనిమిది మందే మహిళలు

అమలాపురం రూరల్, మే 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 13,181 మంది ఎక్కువ ఉన్నారు. అయితే అమలాపురం లోక్‌సభ స్థానంతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేది కేవలం ఎనిమిది మంది మహిళలు మాత్రమే. అమలాపురం అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 15,31,410 మంది ఓటర్లు ఉండగా మహిళలు 7,72,285 మంది, పురుషులు 7,59,104 మంది ఉన్నారు. ఈ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ఒక్క మహిళా అభ్యర్థి కూడా లేకపోవడం విశేషం. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ తరపున బూసిం రమణమ్మ నామినేషన్ దాఖలు చేసినప్పటికీ చివరి రోజు ఆమె ఉపసంహరించుకున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 91 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ఎనిమిది మంది పోటీలో ఉన్నారు. మండపేట, పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల నుంచి ఒక్క మహిళా అభ్యర్థి కూడా పోటీలో లేరు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి అయితాబత్తుల సుభాషిణి (కాంగ్రెస్), బొజ్జా ఐశ్వర్య (లిబరేషన్ కాంగ్రెస్), రామచంద్రపురం నుంచి 13 మంది బరిలో ఉండగా చెక్కా సుజాత (స్వతంత్ర), ముమ్మిడివరం నుంచి 15 మంది పోటీలో ఉండగా ఆర్.మహాలక్ష్మి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), అంగాడి రేవతి (స్వతంత్ర), కొత్తపేట నుంచి 13 మంది బరిలో ఉండగా సుంకర లక్ష్మీమణికుమారి (స్వతంత్ర) రాజోలు నుంచి 10 మంది పోటీలో ఉండగా పులపకూర లిలి నీఆశారాణి (బీఎస్పీ), పోతుమూడి అలివేలుమంగతాయారు (స్వతంత్ర) పోటీలో ఉన్నారు. ఓటర్లుగా ముందున్న మహిళలు అభ్యర్థులుగా పోటీ చేయడంలో వెనుకబడిపోయారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఉన్న మహిళలు 7,72,285 మంది అయినప్పటికీ వారి ప్రాతినిధ్యం పెద్దగా లేకపోవడం చర్చనీయాంశమైంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు తాయిలాలు





సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రకరకాల తాయిలాలు అందిస్తున్నారు. కుల సంఘాల సమావేశాలు నిర్వహిస్తూ పసందైన భోజనాలు పెడుతూ చిరు కానుకలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ పోస్టల్ బ్యాలెట్లపై దృష్టిపెట్టింది. కొత్తపేట అసెంబ్లీ పరిధిలో 1,993 పోస్టల్ బ్యాలెట్‌లు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన వారు తమ అభ్యర్థికే ఓటేయాలంటూ 25 గ్రాములతో తయారు చేయించిన సిల్వర్ కాయిన్లను పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు కానుకగా అందించినట్టు సమాచారం.

– ఆత్రేయపురం



బూట్ పాలిష్ చేసిన నల్లమిల్లి

అనపర్తి, మే 5: అనపర్తి ప్రచారంలో పాల్గొన్న ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్థానిక మెయిన్ రోడ్డులో చెప్పుల దుకాణంలోకి వెళ్లి బూట్ పాలిష్ చేశారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది.



ఎస్‌బీపీ పట్టాభిరామారావు



సంగిత వెంకటరెడ్డి



బి.కమలాదేవి



వల్లూరి నారాయణరావు



వీవీఎస్ఎస్ చౌదరి



బిక్కిన కృష్ణార్జునచౌదరి



వేగుళ్ల జోగేశ్వరరావు

నియోజకవర్గ మార్పులు

కచ్చితమైన తీర్పులు

విలక్షణం..విభిన్నం.. మండపేట నియోజకవర్గం



● (మండపేట)

రాష్ట్రంలోనే ఆర్థిక, సామాజిక అంశాల ప్రభావం అధికంగా ఉండే పారిశ్రామిక వాడ లాంటి ప్రాంతం మండపేట. వ్యవసాయం, వ్యాపారం కలగలిసిన విభిన్న నియోజకవర్గం. రైస్‌మిల్లులు అదనపు ప్రత్యేకత. ఎందుకంటే రాష్ట్రంలోనే అత్యధిక రైస్ మిల్లులు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఆంధ్రా శబరిమలైగా పేరుగాంచిన ద్వారపూడి ఇక్కడే ఉంది..



మండపేటలో రైస్‌మిల్లులు, కోళ్ల పరిశ్రమలతో పాటు, ఆయిల్ పరిశ్రమలు పేపరు మిల్లులు ఉన్నాయి. ఇక్కడ పరిశ్రమల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రైస్ మిల్లుల పరిశ్రమలు ఉన్న ప్రాంతం మండపేట, ద్వారపూడి.. అలాగే కేశవరంలో కోకోకోలా ఫ్యాక్టరీ ఉంది. పాడి పంటలకు, కోళ్ల ఫారాలకు మండపేట నెలవు. పశు పోషణలో కూడా పేరుగాంచింది ఈ ప్రాంతం. ఆంధ్రా హరియాణాగా మండపేటకు పేరుంది. ద్వారపూడిలో వస్త్ర వ్యాపారం ప్రముఖమైనది. ప్రఖ్యాతగాంచిన అయ్యప్ప ఆలయం ఇక్కడే ఉంది.



పామర్రు..ఆలమూరు..మండపేట

పూర్వం పామర్రు నియోజకవర్గం నుంచి ఆలమూరుగా ఆలమూరు నుంచి మండపేట నియోజకవర్గంగా రూపాంతరం చెందింది ఈ నియోజకవర్గం. 1978లో ఆలమూరుగా, 2009లో మండపేట నియోజకవర్గంగా ఏర్పడింది. 1952 నుంచి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఏడు సార్లు కాంగ్రెస్, ఆరుసార్లు టీడీపీ, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. కపిలేశ్వరపురం జమిందార్ ఎస్‌బీపీపీ పట్టాభి రామారావు(కాంగ్రెస్) 1952, 1955, 1962లో జరిగిన ఎన్నికల్లో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. అనంతరం సంగిత వెంకటరెడ్డి (కాంగ్రెస్) మూడు సార్లు విజయం సాధించారు. అలాగే వల్లూరి నారాయణరావు(టీడీపీ), వీవీఎస్ఎస్ చౌదరి (టీడీపీ) రెండేసి సార్లు, వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా మండపేట నుంచి టీడీపీ తరపున మూడు సార్లు విజయం సాధించారు. బి.కమలాదేవి (కాంగ్రెస్), బిక్కిన కృష్ణార్జునచౌదరి (కాంగ్రెస్) నుంచి ఒక్కో దఫా గెలుపొందారు.

మండపేటలో మొత్తం 223 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ 91 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,17,647 మంది ఉన్నారు. వారిలో పురుషులు, 1,05,949 మంది మహిళలు 1,11,692 మంది ఉన్నారు. ఇతరులు నలుగురు ఉన్నారు.

జిల్లా నుంచి తొలి మంత్రి..

జిల్లా నుంచి తొలి మంత్రిగా కేబినెట్‌లో చోటు దక్కించుకున్న ఘనత కపిలేశ్వరపురం జమిందార్‌గా పిలువబడే ఎస్‌బీపీపీ పట్టాభిరామారావుకు దక్కింది. 1952,1955, 1962లో ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. అయితే జమిందార్ కుటుంబాన్ని ఓడించిన ఘనత సంగిత వెంకటరెడ్డి(చిన్నకాపు)కే దక్కుతుంది. వెంకటరెడ్డి రాష్ట్ర మంత్రిగా 1978, 1981, 1989, 1991, 1993 సంవత్సరాలలో ఆలమూరు నియోజకవర్గం నుంచి మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో వివిధ శాఖలను నిర్వర్తించారు.

టీడీపీకి కంచుకోటగా..

2009లో నియోజకవర్గ పునర్విభజన జరిగింది. మండపేట అర్బన్, మండపేట రూరల్, కపిలేశ్వరపురం మండలం, రాయవరం మండలాలతో మండపేట నియోజకవర్గం ఆవిర్భవించింది. అప్పటినుంచి ఇక్కడ జరిగిన మూడు ఎన్నికల్లో కూడా టీడీపీ తరపున పోటీ చేసిన వేగుళ్ల జోగేశ్వరరావు వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. ఆయన నాలుగో సారి మండపేట నుంచి బరిలో నిలిచి వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుతో తలపడుతున్నారు. తొలిసారి 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన వేగుళ్ల జోగేశ్వరరావు సమీప ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి వీవీఎస్ఎస్ చౌదరిపై 17,440 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. 2014లో టీడీపీ తరపున రెండోసారి బరిలో నిలిచిన వేగుళ్ల తన సమీప వైసీపీ అభ్యర్థి గిరిజాల స్వామినాయుడుపై 36,014 ఓట్లతో విజయం సాధించారు. మూడోసారి 2019లో టీడీపీ తరపున బరిలో నిలిచిన వేగుళ్ల సమీప వైసీపీ అభ్యర్థి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌పై 10,600 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే వేగుళ్ల ఐదోసారి టీడీపీ తరపున బరిలోకి దిగి సమీప వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుపై పోటీ చేస్తున్నారు.



పామర్రు రాజకీయ చరితం

1952లో పామర్రు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎస్‌బీబీపీ పట్టాభిరామారావు గెలుపొందారు. తొలి ఎమ్మెల్యేగా జమిందార్ సేవలందించారు. 1955లో జరిగిన ఎన్నికల్లో పట్టాభిరామారావు రెండోసారి విజయం సాధించారు. 1962లో పోటీ చేసిన పట్టాభిరామారావు స్వతంత్ర అభ్యరి ఎం.వీరన్నపై 12,258 ఓట్లు సాధించి వరుసగా మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1967లో సంగిత వెంకటరెడ్డి పట్టాభిరామారావు దూకుడుకు బ్రేక్ వేశారు. కాంగ్రెస్ తరపున బరిలోకి దిగిన పట్టాభిరామారావుపై స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న సంగిత వెంకటరెడ్డి పోటీ చేసి పట్టాభిరామారావుపై 2712 ఓట్లతో విజయం సాధించారు. జమిందార్ గెలుపునకు బ్రేక్ వేసిన నేతగా సంగిత రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన జి.కమలాదేవి సమీప స్వతంత్ర అభ్యర్థి టి.సూరపురెడ్డిపై 16,968 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. పామర్రు నియోజకవర్గానికి ఐదు విడతలు ఎన్నికలు జరగ్గా నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.

ఆలమూరు ఆవిర్భావం

1978లో పామర్రు నియోజకవర్గంలో ఉండే ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలతో పాటు అనపర్తి నియోజకవర్గంలో ఉండే మండపేట మండలాన్ని ఏకం చూస్తూ ఆలమూరు నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 1978లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన సంగిత వెంకటరెడ్డి జనతా పార్టీ నుంచి పోటీ చేసిన ఎస్‌బీటీకే సత్యనారాయణరావుపై 6,573 ఓట్ల ఆధిక్యతతో సంగిత గెలుపొందారు. ఆలమూరు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా సంగిత విజయం సాధించారు. 1983లో టీడీపీ అభ్యర్థి వల్లూరి నారాయణరావుపై కాంగ్రెస్ తరపున పోటీ చేసిన సంగిత 29,636 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1985లో టీడీపీ తరపున పోటీ చేసిన వల్లూరి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి వాలిన సూర్యభాస్కరరావుపై 20,371 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున మూడో సారి బరిలో దిగిన వల్లూరి నారాయణరావు, కాంగ్రెస్ అభ్యర్థి సంగిత వెంకటరెడ్డిపై 978 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. 1994లో ఆలమూరు నుంచి టీడీపీ తరపున వీవీఎస్ఎస్ చౌదరి కాంగ్రెస్ అభ్యర్థి సంగిత వెంకటరెడ్డిపై 16,710 ఓట్ల ఆధిక్యతతో చౌదరి గెలుపొందారు. 1999లో రెండోసారి టీడీపీ తరపున పోటీ చేసిన చౌదరి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి బిక్కిన కృష్ణార్జునచౌదరిపై 12,630 ఓట్లతో గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావుపై కాంగ్రెస్ అభ్యర్థి బిక్కిన కృష్ణార్జునచౌదరి 8017 ఓట్లతో గెలుపొందారు. ఆలమూరు నియోజకవర్గం ఉన్నంత వరకు ఏడు విడతలు ఎన్నికలు జరగ్గా టీడీపీ నాలుగు దఫాలు, కాంగ్రెస్ మూడుసార్లు గెలుపొందాయి. ఎన్నికలు 14 సార్లు జరిగినా ఇక్కడ గెలుపొందిన అభ్యర్థులు మాత్రం నలుగురు మాత్రమే.

జన కేతనం
ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డీబీ లోక్

తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే సీటు ఇవ్వడం సిగ్గుచేటు

దళిత ప్రజా సంఘాల సమావేశంలో వక్తల మండిపాటు

అమలాపురం రూరల్, మే 5: శిరోముండనం కేసులో శిక్ష పడ్డ తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వడం సిగ్గుచేటని దళిత ప్రజా సంఘాల సమావేశం ఆరోపించింది. మండపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న త్రిమూర్తులును చిత్తుగా ఓడించాలని శిరోముండనం బాధితుల న్యాయ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. కామనగరువులోని బీవీ రమణయ్య కాలనీలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ పోరాట కమిటీ సమావేశాన్ని ముఖ్య నాయకులతో నిర్వహించారు. దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని వెంకటాయపాలెం దళిత యువకులు మూడు దశాబ్దాల పాటు చేసిన న్యాయ పోరాటం చరిత్రలో నిలుస్తుందన్నారు. బాధితులకు పూర్తి న్యాయం జరగకపోవడం ఆవేదన కలిగించిందన్నారు. త్రిమూర్తులు నేరస్తుడని నిర్ధారించి జైలు శిక్ష విధించినప్పటికీ వైసీపీ ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వడం దారుణమని విమర్శించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి ప్రభుత్వమే ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పోరాట కమిటీ సహ కన్వీనర్ రేవు నాగేశ్వరరావు, మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి యేడిద రాజేష్, డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు అమలదాసు బాబూరావు, పీడీఎం నాయకులు దీపాటి శివప్రసాద్, శెట్టిబత్తుల తులసీరావు, నాయకులు బొంతు రమణ, మెండి డేవిడ్, గెద్దాడ బుద్ధరాజ్, కొండేపూడి రవి పాల్గొన్నారు.

కొవ్వూరులో నారా రోహిత్ ప్రచారం



కొవ్వూరులో ప్రచారం నిర్వహిస్తున్న నారా రోహిత్

కొవ్వూరు, మే 5: కొవ్వూరులో సినీ హీరో నారా రోహిత్ ఆదివారం కూటమికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున ప్రచారంలో పాల్గొన్నారు. కొవ్వూరు పట్టణం, వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, బంగారం పేట వరకు ప్రచారం చేశారు. భావితరాల భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధి కోసమే కూటమి ఏర్పడిందన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

రేపు కోరుకొండకు సీఎం జగన్ రాక

కోరుకొండ, మే 5: రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో ఈ నెల 7న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు లక్ష్మీనరసింహస్వామి దేవాలయంవీధిలో ఈ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

అభిమానుల ప్రేమకు దాసోహం

పిఠాపురం నియోజకవర్గంలో హీరో సాయిధరమ్ తేజ్ ప్రచారం



రోడ్‌షోలో పాల్గొన్న సాయిధరమ్‌తేజ్



పూల వర్షం

పిఠాపురం/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మే 5: 'మా సేనానిని గెలిపించండి, మీ అందరి ప్రేమకు మేమంతా దాసోహం అవుతాం' అని మెగా హీరో సాయిధరమ్‌తేజ్ అన్నారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పిఠాపురం మండలం పాత కందరాడ, ఎఫ్‌కేపాలెం సెంటర్, కొత్త కందరాడ, కుమారపురం, పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు మీదుగా చిత్రాడ గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. అక్కడ నుంచి గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట, తాటిపర్తి గ్రామాల్లో రోడ్‌షో కొనసాగింది. ఎఫ్‌కేపాలెం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ నేను ఒక హీరోగా, పవన్‌కు మేనల్లుడిగా ప్రచారానికి రాలేదని, ఒక సేనానికి సైనికుడిగా ప్రచారానికి వచ్చినట్లు తెలిపారు. పవన్‌కల్యాణ్ ఎల్లప్పుడు ప్రజల పక్షాన నిలబడతారని చెప్పారు. మా సేనానిని గెలిపించండి, నియోజకవర్గ అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తారని తెలిపారు. వేసే ఓట్లకు ఈవీఎంలు పగిలేలా ఉండాలన్నారు. పోలింగ్ రోజున గాజుగ్లాసు మోత మోగాలని, ఫ్యాన్ రెక్కలు విరిగిపోవాలన్నారు. తనకు 2021లో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు పిఠాపురం నియోజకవర్గంలోని అభిమానులు, ప్రజలు పురుహూతికా అమ్మవారికి పూజలు చేశారని వారందరికీ తాను రుణపడి ఉంటానని చెప్పారు. ప్రజల నుంచి సాయిధరమ్‌తేజ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. అడుగడుగునా పూల వర్షంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన నేత డాక్టర్ పిల్లా శ్రీధర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు విస్తృత ఏర్పాట్లు

ఒంటి గంటకే సభా ప్రాంగణానికి చేరుకోవాలి
పార్కింగ్‌లోనే వాహనాలు నిలపాలి
ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రాక సందర్భంగా అత్యంత పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సభా ప్రాంగణం, హెలిపాడ్ తదితర ప్రదేశాలను ఎస్‌పీజీ తమ ఆధీనంలోకి తీసుకొంది. పెద్ద సంఖ్యలో పోలీసులను, కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. తనిఖీ బృందాలు అణువణువునూ జల్లెడ పడుతున్నాయి. ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలని, ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని ఎస్పీ జగదీశ్ సూచించారు. అటు విజయవాడ, ఇటు విశాఖ వైపు నుంచి వచ్చే వాహనాల కోసం వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు విశాలంగా ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులను గమనించుకుంటూ ప్రయాణించాలని ఆయన సూచించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఒంటి గంటకే సభా ప్రాంగణానికి చేరుకోవాలి

ప్రధాని మోదీ చేరుకొనే హెలిప్యాడ్‌ల నుంచి సభా ప్రాంగణానికి హైవేతో కలుపుకొని 1.6 కిలోమీటర్ల దూరం ఉంది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఈ మార్గంతో పాటు వేమగిరి జంక్షన్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకునే మార్గాలను భద్రతా బలగాలు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటాయి. వాహనాలను, ప్రజలను అనుమతించరు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. తీవ్రమైన ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. అందువల్ల మధ్యాహ్నం ఒంటి గంట లోపుగానే సభా ప్రాంతానికి చేరుకొని నిర్దేశిత ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసి వేదిక వద్దకు ప్రజలు చేరుకోవాలని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే

రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లు దాటిన తర్వాత ఎడమవైపు పార్కింగ్ నెం.7, 8లో నిలుపుకోవాలి. కాస్త ముందుకు వెళ్లిన తర్వాత కూడా ఎడమవైపు కార్లు(నెం.6), ఆ వెనుక 4ఏ, 4బీ ప్రదేశాల్లో బస్సులు పార్క్ చేయాల్సి ఉంటుంది. కుడివైపున పార్కింగ్ నెం.5లో కార్లు, బస్సులు నిలపాలి. అలాగే వేమగిరి జంక్షను వైపు నుంచి వచ్చే వాహనాల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు ఎడమవైపున పార్కింగ్ నెం.2లో పెట్టాలి. కుడివైపున కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ నెం.1లో, ఈ పార్కింగ్ వెనుక పార్కిగ్ నెం.3లో బస్సులు నిలపాల్సి ఉంటుంది. వీవీఐపీ పాసులు ఉన్న వాహనాలను 4ఏ పార్కింగ్‌లో నిలపాలి. డయాస్ పాస్ ఉన్నవారు మీటింగ్ ప్రాంతంలో దిగి వారి వాహనాలను వేమగిరి జంక్షను దగ్గరలోని విందు రెస్టారెంట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో పెట్టాలి. మధ్యాహ్నం 2గంటల నుంచి ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ, వేమగిరి జంక్షను నుంచి క్వారీ కెనాల్ రోడ్డు పీవీఆర్ ఎస్టేటు వద్ద ఏర్పాటు చేసి పార్కింగ్ నెం.5కి వాహనాలను మళ్లిస్తారు.



అమలాపురంలో వివిధ సంఘాల ముఖ్యులతో సమావేశమైన హరీష్‌మాధుర్

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాం

అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి హరీష్‌మాధుర్



అమలాపురంలో మెట్ల రమణబాబుతో కలిసి ప్రచారం చేస్తున్న హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, మే 5: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన, దోపిడీలను అరికట్టేందుకే కూటమిగా జట్టు కట్టామన్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో యువతతో పాటు మహిళలు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆదివారం ఆయన అంబాజీపేట మండలం మాచవరంలో పి.గన్నవరం అసెంబ్లీ కూమటి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆర్యవైశ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పలుచోట్ల మహిళలు హరీష్‌మాధుర్‌కు హారతులిచ్చి స్వాగతం పలికారు. అమలాపురం 20వ వార్డులో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి హరీష్‌మాధుర్ ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి తనకు, ఎమ్మెల్యే అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో కూటమి నాయకులు చెరుకూరి సాయిరామ్, చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, యేడిద శ్రీను, తిక్కా సత్యలక్ష్మి, గొలకోటి విజయలక్ష్మి, పడాల శ్రీదేవి, పలివెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. హరీష్‌మాధుర్ సోదరీమణులు దీప్తి, రమ్య, కీర్తి ఐ.పోలవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు, సోదరుడైన హరీష్‌మాధుర్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని నమూనా బ్యాలెట్లతో ప్రచారం చేశారు. వారికి పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. అమలాపురం భగత్‌సింగ్ సెంటర్‌లోని సత్యనారాయణ విలాస్‌లో ఏబీవీపీ ప్రతినిధి గన్నవరపు అంజనీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో హరీష్‌మాధుర్ మాట్లాడారు. జిల్లా అభివృద్ధి కోసం సంఘీయులు రూపొందించిన మేనిఫెస్టో అమలుకు తన వంతుకృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యల్లమిల్లి నాగసుధాకొండలరావు, శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఊటుకూరి మురళీ, గోళ్ల వీరబాబు, యక్కల బ్రహ్మేష్ తదితరులు పాల్గొన్నారు.



ఐ.పోలవరంలో అన్నయ్యకు మద్దతుగా ప్రచారం చేస్తున్న హరీష్‌మాధుర్ సోదరీమణులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుతూ..

అమలాపురం రూరల్, మే 5: రాష్ట్రంలోను, దేశంలోను ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు అధికారంలోకి రావాలని కోరుతూ భట్నవిల్లిలోని శ్రీసకలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ రెండు రోజులుగా చండీ హోమం, రాజశ్యామల యాగం నిర్వహించారు. ఆదివారం వేద పండితులు పూర్ణాహుతి జరిపారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు-పవన్‌కల్యాణ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు దేశం సుభిక్షంగా ఉండాలని రాజశ్యామల యాగం నిర్వహించామన్నారు. పూర్ణాహుతిలో హరీష్ బాలయోగి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అరాచక, రాక్షస పాలన అంతమై చంద్రబాబు పాలన రావాలని ఆయన ఆకాంక్షించారు.



భట్నవిల్లి సకలేశ్వరస్వామి ఆలయంలో రాజశ్యామల యాగం నిర్వహిస్తున్న హరీష్‌మాధుర్

జిల్లాలో తొలిరోజు 59.61 శాతం

» పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న పీవోలు, ఏపీవోలు, ఇతర పోలింగ్ సిబ్బంది » అత్యధికంగా అమలాపురంలో 78.02 శాతం » అత్యల్పంగా కొత్తపేటలో 42.55 శాతం పోలింగ్

అమలాపురం టౌన్, మే 5: సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బందికి జిల్లాలో ఏడు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఆదివారం నుంచి పోస్టల్ బ్యాలెట్ వేసే అవకాశం కల్పించారు. తొలి రోజు పీవోలు, ఏపీవోలు, ఇతర పోలింగ్ సిబ్బంది 59.61 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా అమలాపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో 1,715 మందికి 1,338 మంది ఓటు వేయడం ద్వారా 78.02 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా కొత్తపేట నియోజకవర్గంలో 1,993 మందికి 848 మంది ఓటు వేయగా 42.55 శాతం నమోదైంది. రామచంద్రపురంలో 1,368 మందికి 1,020 మంది ఓటు వేయడం ద్వారా 74.56 శాతం, ముమ్మిడివరంలో 1,534 మందికి 656 మందితో 42.76 శాతం, రాజోలు ఎస్సీ నియోజకవర్గంలో 1,804 మందికి 1,052 మంది ఓటేయడం ద్వారా 58.31 శాతం, పి.గన్నవరంలో 1,840 మందికి 1184 మందితో 64.35 శాతం, మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 1,367 మందికి 829 మంది ఓటేయడం ద్వారా 60.64శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 11,621 మందికి 6,927 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఉదయం అభ్యర్థులు పినిపే విశ్వరూప్, అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను కలెక్టర్ హిమాన్షు శుక్లా స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి జి.కేశవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కాగా సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది.



కొత్తపేటలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కొత్తపేట: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా ఆదివారం పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 1,993 పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా మొదటి రోజు పోలింగ్ ముగిసే సమయానికి 848 మంది ఓటు వినియోగించుకోగా 42.55 శాతం నమోదైంది. కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి, రిటర్నింగ్ ఆఫీసర్ జీవీవీ సత్యనారాయణ, ఏఆర్వో జి.ఎలీషా పర్యవేక్షించారు.



అమలాపురంలో ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

వచ్చేది చంద్రబాబు రామ రాజ్యపాలనే

అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు



గోడిలంకలో ఆనందరావుకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

అల్లవరం, మే 5: ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా రామ రాజ్య పాలన రానుందని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో మండలంలోని గోడి, గోడితిప్ప, గోపాయిలంక, గోడిలంక గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ప్రజలను మోసం చేసిన జగన్ పాలనకు ప్రజలు స్వస్తిపలికి కూటమికి పట్టంకట్టాలన్నారు. నిత్యావసరాలు, మద్యం ధరలు పెంచి వైసీపీ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, హరీష్ మాధుర్‌ను గెలిపించాలని కోరారు. గోడిలంకతో పాటు పలు గ్రామాల్లో టీడీపీ కూటమి నాయకులకు ఘనస్వాగతం లభించింది. ఇంటింటికీ తిరిగి కూటమి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ అరచాక పాలనను అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పలుచోట్ల ఆనందరావుకు మహిళలు హారతులు ఇచ్చారు. బీసీ, ఎస్సీలకు వెన్నుదన్నుగా నిలిచిన టీడీపీ పాలనలోనే రహదారులు నిర్మించారని గుర్తు చేశారు. ప్రచారంలో టీడీపీ ప్రముఖులు మెట్ల రమణబాబు, చెరుకూరి సాయిరామ్, పెచ్చెట్టి విజయలక్ష్మి, బొర్రా ఈశ్వరరావు, వేగిరాజు సుబ్బరాజు (శ్రీనురాజు), నడింపల్లి సుబ్బరాజు, అల్లూరి సత్యనారాయణరాజు, రుద్రరాజు బాబు, బసవా సింహాద్రి, తోట శ్రీదేవినరసింహరావు, కాండ్రేగుల వెంకటసత్యనారాయణ, కడలి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి అరుణ ఆదివారం కామనగరువు, గూడాల గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, పేరూరి విజయలక్ష్మి, గెల్లా మీనాకుమారి పాల్గొన్నారు.



గోడిలంకలో ఇంటింటా ప్రచారం చేస్తూ విక్టరీ సింబల్ చూపిస్తున్న కూటమి అభ్యర్థి ఆనందరావు



గోడిలంకలో కూటమి అభ్యర్థి ఆనందరావుకు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు సత్తిబాబురాజుకు సన్మానం



అమలాపురం రూరల్ కామనగరువులో ఆనందరావుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఆయన సతీమణి అరుణ

పోలింగ్ ప్రక్రియపై సూక్ష్మ పరిశీలకులకు

అవగాహన ఉండాలి: కలెక్టర్

అమలాపురం టౌన్, మే 5: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పట్ల సూక్ష్మ పరిశీలకులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియను విభిన్న కోణాల్లో పరిశీలించాలన్నారు. సూక్ష్మ పరిశీలకులు నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. మాక్ పోల్ ప్రారంభమయ్యే సమయంలో సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ స్టేషన్‌లో ఉండాలని సూచించారు. నియమితులైన సూక్ష్మ పరిశీలకులకు ఫొటో గుర్తింపు కార్డు, ఎంట్రీ పాసు అందజేస్తామన్నారు. సూక్ష్మ పరిశీలకుల ప్రధాన విధులను కలెక్టర్ వివరించారు.

రాజస్థాన్ నుంచి ఐదు కంపెనీల కేంద్ర బలగాలు

అమలాపురం టౌన్, మే 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజస్థాన్ నుంచి అదనంగా ఐదు కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలో నాలుగు సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలు ఉన్నాయన్నారు. అదనంగా మరిన్ని కేంద్ర బలగాలు ఎన్నికల విధుల నిమిత్తం జిల్లాకు రానున్నట్టు ఎస్పీ తెలిపారు. రామచంద్రపురం వీఎస్ఎస్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకుడు పరదీప్‌కుమార్ ఆదివారం పరిశీలించారు.

టీడీపీ, జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు

పి.గన్నవరం, మే 5: గంటి పెదపూడికి చెందిన స్థానిక యువనాయకుడు కుప్పాల పెదకాపు ఆధ్వర్యంలో పలువురు యువకులు టీడీపీ, జనసేన పార్టీలో చేరారు. నియోజకవర్గ సహాకన్వీనర్ నామన రాంబాబు, గంధం పల్లంరాజు, నల్లా అజయ్, సంజయ్, స్థానిక టీడీపీ, జనసేన నాయకులు కండువాలను కప్పి టీడీపీ, జనసేనలో ఆహ్వానించారు. షేక్ సుభాన్, చిక్కాల గణేష్, కనకరాజు సూరి, సంసాని పెద్దిరాజు, కొమ్మల శ్రీను, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీటీసీ పల్లి మోషే పాల్గొన్నారు.

'నల్ల చట్టంపై తిరుగుబాటు చేయాలి'


సదస్సులో మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు

ముమ్మిడివరం, మే 5: నీతి ఆయోగ్ నిర్దేశిత సూత్రాలను వక్రీకరించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దొడ్డి దారిలో దొంగ జీవోలు తీసుకువచ్చి ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తీసుకువచ్చారని రాష్ట్ర బార్ కౌన్సిలింగ్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. ముమ్మిడివరం టీడీపీ కార్యాలయంలో ఆదివారం న్యాయవాదులు, మేధావుల ఆత్మీయ సదస్సు ముమ్మిడివరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగింది. సదస్సులో ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ నీతి అయోగ్ నిర్దేశిత సూత్రాలకు ఐదు నెలల ముందే ల్యాండ్ టైట్లింగ్ తీసుకువచ్చారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోను అమలు చేయకుండా మన రాష్ట్రంలో తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో 10లక్షల కేసులకు సంబంధించి 50మంది న్యాయమూర్తులు ఉండవలసి ఉండగా కేవలం 13మంది మాత్రమే ఉన్నారన్నారు. కోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంచితే కేసులు సత్వర పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. సదస్సులో రాజ్యాంగ వ్యతిరేక భూహక్కు చట్టంపై సుదీర్ఘ చర్చ జరిపారు. ఈసదస్సులో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్, నాగాబత్తుల శ్రీనివాసరావులు చర్చలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలు, మేధావులు, న్యాయవాదులంతా నల్ల చట్టంపై తిరుగుబాటు చేయాలన్నారు. ప్రజలు దీనిపై పూర్తి అవగాహన కల్పించి రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. సదస్సులో కుచ్చర్లపాటి తాతంరాజు, చింతపల్లి అజయ్‌కుమార్, రెడ్డి సత్యనారాయణమూర్తి, బీర ప్రతాప్, రామాయణం మనేశ్వరరావు, ఈఎస్ బాబు, రెడ్డి సుబ్రహ్మణ్యశాస్త్రి, బొంతు శ్రీరాములు, అయినవిల్లి వలియాబాబా, గిడ్డి రామ్మోహనరావు, పోతుల రాజారావు, కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు, వడ్డి త్రిమూర్తులు, కాశి సిద్ధార్థకుమార్, గోనమండ వెంకటేశ్వరరావు, నందికి శ్రీనివాసరావు, అబ్బిరెడ్డి సురేష్, మెరుగుపువ్వు మోహనరావు, పరమట మోహనరావు, ముదునూరి అచ్యుతరామరాజు, పచ్చమట్ల సుబ్బరాజు, పచ్చమట్ల శ్రీనివాసరాజు, గొల్లపల్లి గోపి, గీసాల చంద్రరావు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై అసత్య ప్రచారాలు

పి.గన్నవరం, మే 5: ప్రధాని మోదీ ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తారని వైసీపీ నాయకులు అసత్యప్రచారాలు చేస్తు న్నారని, ఇది అపోహ మాత్రమేనని ప్రముఖ కొరియోగ్రాఫర్ జానిమాస్టర్ అన్నారు. పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేసే రోజు వస్తే జనసేనాని పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో నేను ముం దుండి ఎంతటిపోరాటానికైనా సిద్ధపడతానన్నారు. ముస్లింలు అసత్య ప్రచరాలు నమ్మవద్దని, కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. మా భూమి పత్రాలపై సీఎం ఫొటో ఉండటం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం క్రిమినల్ మైండ్‌తో ఆలోచిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే యువ తకు ఉద్యోగాలు లేక నాశనమైపోయిందని, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముం దుగా శాంతిభద్రత, విద్య, వైద్యంపై దృష్టిపెడుతుందన్నారు.

టీడీపీలో చేరిక

ఆత్రేయపురం, మే 5: ఆదివారం ఆత్రేయపురంలో నిర్వహించిన సమావేశంలో క్షత్రియ సామాజికవర్గ ప్రముఖుడు, వైసీపీ నేత గాదిరాజు వరప్రసాదరాజు తన వర్గీయులతో టీడీపీలో చేరారు. వారందరికీ కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. బండారు తనయుడు సంజీవ్ మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఓటర్లను కలిసి తన తండ్రిని గెలిపించాలని కోరారు. పార్టీ ముఖ్యనేతలు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను వివరించారు.

టీడీపీ ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం, మే 5: కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ ముమ్మిడివరం నగర పంచాయతీ 16వ వార్డు పరిధిలోని కొండేపూడివారిపేట, పితానివారిపాలెం, చిప్పలపాలెం, విద్యుత్ సబ్‌స్టేషన్, బొక్కావారిపాలెం, కొండాలమ్మ చింత, టీటీఆర్ నగర్‌ల్లో ఆదివారం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోను ఓటర్లకు వివరించి ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పితానివారిపాలెంలో రోడ్లు, బొక్కావారిపాలెంలో కాల్వకు వంతెన, పాంచాల నిర్మించాలని, విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, నాయకులు పొద్దోకు నారాయణరావు, పితాని రాము, రెడ్డి సుబ్బారావు, దాట్ల బాబు, వాసురాజు, గోరింట శ్రీనురాజు, సైదం అప్పారావు, సైదం శ్రీను, గాలిదేవర వీరబాబు, సరిపెల్ల శ్రీనురాజు, యాళ్ల ఉదయ్, నాగరాజు, సత్తి నూకరాజు, విళ్ల వీరాస్వామినాయుడు, కర్రా ప్రసాద్ పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్‌పై ఫిర్యాదు

రాయవరం, మే 5: వెంటూరుకు చెందిన ఎండీయూ ఆపరేటర్ ప్రసాద్ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని గ్రామానికి చెందిన కొందరూ సీవిజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై తహశీల్దారు ఆర్‌వీ కృష్ణారావును వివరణ కోరగా సంఘటనపై విచారణ జరుపుతామని చెప్పారు.

- భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం ఆధ్వర్యంలో వినతిపత్రాలు
- రైతులకు వడ్డీలేని పంట రుణాలు అందించాలి

రైతుల డిమాండ్లను పరిష్కరించాలని బీకేఎస్ వినతులు


కొత్తపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావుకు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎస్ నాయకులు

అమలాపురం టౌన్, మే 5: జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులకు భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రాలు అందజేశారు. రైతులకు రూ.5లక్షల వరకు వడ్డీలేని పంట రుణాలు అందించాలని, పండించిన పంటలు స్వేచ్ఛా వాణిజ్యం జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని, కొబ్బరి బోడకాయ కిలో రూ.45గా నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయించడంతో పాటు సాగునీటి, మురుగునీటి కాల్వలను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని కోరుతూ అభ్యర్థులు బండారు సత్యానందరావు, చిర్ల జగ్గిరెడ్డి, గిడ్డి సత్యనారాయణ, విప్పర్తి వేణుగోపాలరావులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీకేఎస్ నాయకులు తిక్కిరెడ్డి గోపాలకృష్ణ, ముత్యాల జమీల్, ఉప్పుగంటి భాస్కరరావు, మాకిరెడ్డి సత్తిబాబు, చేకూరి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తుల రక్షణ కరువు




ఏడిద, ఏడిత సీతానగరంలో కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ప్రచారం, వేగుళ్లకు బొట్టుపెడుతున్న మహిళ, వృద్ధురాలితో మాటా మంతీ

మండపేట కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



మండపేట మండలం తాపేశ్వరంలో వేగుళ్ల జోగేశ్వరరావుకు మద్దతుగా ఆయన కుమార్తెలు, కుటుంబ సభ్యుల ఎన్నికల ప్రచారం చేస్తున్న దృశ్యాలు

మండపేట, మే 5: రాష్ట్రంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టు అమలు ద్వారా ప్రజల ఆస్తులకు, పొలాలకు భద్రత లేకుండా పోతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ అరాచక పాలనకు ఇదో మచ్చుతునక అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు మరణ శాసనంగా మారిన ఈయాక్టును చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ రద్దుచేస్తారన్నారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని వేగుళ్ల చెప్పారు. ఏడిద, వై.సీతానగరం గ్రామాల్లో జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, బీజేపీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఏడిద, వై.సీతానగరం గ్రామాలను అభివృద్ధి చేశామన్నారు. ప్రజలు నాల్గవసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకుడిగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేస్తాన న్నారు. కూటమి మేనిఫెస్టో ద్వారా 50ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలకు రూ.4వేలు పింఛన్ అందిస్తామన్నారు. ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20వేలు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలను వివరించారు. నియోజ కవర్గంలో కులరాజకీయాలు, బెదిరింపులు, షటిల్‌మెంట్స్ చేసే వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. గ్రామాల్లో ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో యువతతో పాటు మహిళలు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు యరగత బాబ్జి, డీసీ కమిటీ మాజీ చైర్మన్ కోలు పోటి బాబు, బీజేపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కోటిపల్లి సాయిరాం, పెనుమత్స రమేష్‌రాజు, పిల్లా తాతీలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తాపేశ్వరంలో వేగుళ్ల విజయం కోరుతూ ఆయన కుమార్తెలు మణిమంజరి, సాయిసుమన, కుటుంబ సభ్యులు ఆది వారం ఎన్నికల ప్రచారం చేశారు. వారితో పాటు సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి, స్థానిక నేతలు ప్రచారంలో పాల్గొని సూపర్‌సిక్స్ పథకాలు గురించి వివ రించారు. మండపేటలో వేగుళ్ల అల్లుడు వల్లూరి సాయికు మార్‌బాబు, తమ్ముడు కుమారుడు వేగుళ్ల అజయ్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వల్లూరి రామన్నచౌదరి తదితరులు స్థానిక నేతలతో కలిసి వార్డుల్లో వేగుళ్ల విజయం కోరుతూ ప్రచారం చేశారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి




వృద్ధుడిని పలకరించి ఓటు అభ్యర్థిస్తున్న కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రావు ప్రచారం, చిన్నారితో దాట్ల బుచ్చిబాబు



తాళ్లరేవు మండలంలో దాట్ల బుచ్చిబాబు ఎన్నికల ప్రచారం, వృద్ధుడికి సూపర్‌సిక్స్ కరపత్రం అందిస్తున్న బుచ్చిబాబు

ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు

తాళ్లరేవు, మే 5: నకిలీ నవరత్నాలతో ప్రజలను మోసంచేసిన వైసీపీ పాలన అంతానికి రోజులు దగ్గరపడ్డాయని ముమ్మిడివరం కూటమి ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. క్లస్టరు ఇన్‌చార్జి టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో పటవల, కొత్తూరు, రాఘవేంద్రపురం, రామన్నపాలెం, ఈబీసీ కాలనీ, శాంతమూల గ్రామాల్లో ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ప్రజలు, మహిళలు ఘనస్వాగతం పలుకుతూ హారతులు ఇచ్చారు. ఈసందర్భంగా ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ నాలుగన్నరేళ్లగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవడం ద్వారా రాష్ట్ర అభివృద్ధితో పాటు ముమ్మిడివరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈనెల13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లను సైకిల్‌గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గాజుల విష్ణుచక్రం, మేడిశెట్టి గోపాల్, బీర రాజేష్, వీరబాబుచౌదరి, సర్పంచ్‌లు బీర మాలయ్య, పుణ్యమంతుల సూరిబాబు, సిద్దన సీతారామయ్య, మేకల కృష్ణ పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచించాల్సి అవసరం ఎంతైనాఉంది

సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసే ప్రజలంతా ఆలోచించాల్సిన అవసరం ఆసన్నమైనదని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ చేసిన అభివృద్ధి ఎక్కడా కనపడం లేదన్నారు. మంచి ప్రభుత్వాలను ప్రజలు ఓటుతో ఆశీర్వదిస్తే ఐదేళ్ల ప్రజలకు ఇబ్బందులు పడకుండా సంక్షేమ పాలన అందుతుందన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు వరాలు కురిపిస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు పెమ్మాడి కృష్ణవేణి అన్నారు. రామన్నపాలెంలో ఇంటింటా తిరిగిప్రచారం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్‌సిలిండర్లు, ఎంతమంది ఉంటే అందరికీ తల్లికివందనం, 18ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు రూ.1500, నిరుద్యోగులకు రూ.3000 ఇస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలు, రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందన్నారు.మహిళా నేతలు పితాని హేమలత, బొద్దు రాజేశ్వరి, రామలక్ష్మి, వెంటపల్లి ఉమా మహేశ్వరి, ఎంపీపీ రాయుడు సునీతపాల్గొన్నారు.

వైసీపీకి ఎంపీపీ రాజీనామా

వైసీపీకి చెందిన ఎంపీపీ రాయుడు సునీత, రాయుడు గంగాధర్‌లు వైసీపీకి రాజీనామచేసి మట్లపాలెం మహాలక్ష్మమ్మ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

42.85 శాతం బ్యాలెట్ ఓటింగ్

ముమ్మిడివరం, మే 5: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో 1534 బ్యాలెట్ ఓట్లు ఉండగా జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆదివారం సాయంత్ర 6 గంటలకు 656మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 656మంది ఓటు హక్కు వినియోగించుకోగా 42.85శాతం ఓట్లు పోలయ్యాయి.

74.56 శాతం పోలింగ్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 5: రామచంద్రపురం నియోజకవర్గంలో ఆదివారం స్థానిక వీఎస్ఎం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో నిర్వహించిన పోస్టల్‌బ్యాలెట్ ఓటింగు 69.95శాతం నమోదైంది. నియోజకవర్గంలో 1,368ఓట్లకు 1,022 మంది పీవో, ఏపీవో, ఓపీవోలు ఓటింగు హక్కు వినియోగించుకన్నారు. వీఎస్ఎం కళాశాలలో జరిగిన పోస్టల్ బాలెట్ ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా పరిశీలించారు. బ్యాలెట్‌పత్రాలు జారీ, పోలింగ్ బూత్‌లు, ఓటింగ్ జరుగుతున్న విధానం పరిశీలించారు. రామచంద్రపురం రిటర్నింగ్ అధికారి సుధాసాగర్‌కు పలు సూచనలు ఇచ్చారు.

65 శాతం ఓటింగ్

పి.గన్నవరం, మే 5: పి.గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి స్థానిక హైస్కూల్‌లో జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో మొదటిరోజు 65శాతం ఓటింగ్ నమోదైనట్లు ఆర్వో ఏ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. నియోజకవర్గంలో 1,840ఓట్లకు 1,193మంది ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, ఓపీవో, ఉద్యోగులు ఓటు వేశారు. ఎన్నికల సంఘం తొలిసారి ఇచ్చిన అవకాశంతో ఇద్దరు జర్నలిస్టులు పోస్టల్‌బ్యాలెట్ ఓటు వేశారు.

ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

యానా, మే 5: యానాంలో తొలిసారిగా ఆదివారం నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని నవోదయ ప్రిన్సిపాల్, నీట్ కోఆర్డినేటర్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. యానాం జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన పరీక్షకు 123మంది విద్యార్థులకు 122మంది హాజరయ్యారు.

'ఎమ్మెల్సీ తోట దళితులను అవమానించారు'

మండపేట, మే 5: వైసీపీ నేత, ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు 2013లో దళితులను బూటు కాలుతో తన్ని అవమానించిన విషయం వాస్తవం కాదని దైవప్రమాణం చేయగలరా? అని ఎమ్మార్పీఎస్ ఆకుమర్తి చిన్న మాదిగ ప్రశ్నించారు. తోట దురాగతాలను నిశితంగా చూసిన వ్యక్తినని ఆకుమర్తి చెప్పారు. తోటకు దళితులంటే ఎప్పుడు చులకనేనని ఆయన అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత యువకుడిని కారు డిక్కీలో పెట్టి తోట హత్యచేసే ప్రయత్నం చేస్తే తానే అడ్డుకుని ఎస్పీకి ఫిర్యాదు చేసిన విషయాన్ని చిన్నమాదిగ గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ సమయంలో తోట తనపై 30కేసులు పెట్టించిన విషయాన్ని తాను మరిచిపోలేదన్నారు. శిరోముండనం కేసులో శిక్షపడిన తోటకు మండపేట నియోజకవర్గంలో దళితులెవరూ ఓట్లు వేయవద్దని ఆయన పిలుపు ఇచ్చారు. తోటను చిత్తుగా ఓడించాలని దళితులకు పిలుపు ఇచ్చారు. మండపేట నుంచి కూటమి అభ్యర్థి వేగుళ్లను గెలిపించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందపల్లి చంద్రశేఖర్, దొమ్మలపాటి మురళి, మోరంపూడి విజయ్, పూడిమళ్ల విజయ్, చాపల జోష్, దార్ల ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం



అంతర్వేది, మే 5: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం బహుళ ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత అర్చకులు స్వామి-అమ్మవార్లను పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక అలంకరణలో కొలువుతీర్చారు. అనంతరం కల్యాణ తంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం: గిడ్డి



మాచవరంలో ప్రచార రథంపై నుంచి ఓట్లు అభ్యర్థిస్తున్న గిడ్డి సత్యనారాయణ అంబాజీపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు


టీడీపీలో చేరిన వారిని ఆహ్వాని స్తున్న కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, మే 5: పి.గన్నవరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తానని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన మాచవరంలో పర్యటించారు. గ్రామ దేవతలు ఇటికాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆయన సమక్షంలో వివిధ పార్టీల నుంచి సుమారు 50మంది టీడీపీలో చేరగా వారందరికీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ప్రచారరథంపై నుంచి సత్యనారాయణ ప్రచారం నిర్వహించారు. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, జనసేన స్టార్ క్యాంపెయినర్, ప్రముఖసినీ డ్యాన్స్ మాస్టర్ జానీ, జనసేన తెలం గాణ రాష్ట్ర నాయకుడు సంపత్‌నాయక్‌లతో కలిసి సత్యనారాయణ ప్రచారం చేశారు. అంబేడ్కర్, జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.గన్నవరం నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, సుంకర బాలాజీ, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల బలరామమూర్తి, కొర్లపాటి గోపి, బొంతు పెదబాబు, చిన్నం బాలవిజయరావు, దొమ్మేటి శ్యామ్, ఖైపాల తాతాజీ, గుడాల ఫణి, దంతులూరి శ్రీనురాజు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, సుంకర నాయుడు, వాసంశెట్టి చినబాబు, మందా రాజేష్, నేదునూరి పెద్దిరాజు, రవణం రాము, కత్తుల బాబులు, పితాని రామకృష్ణ, మేడిద శ్రీనివాసరావు, దొమ్మేటి రామారావు, పెదపూడి శ్రీనివాసరావు, కొప్పినీడి ఈశ్వరరావు, మహిళా నాయకులు సుంకర సత్యవేణి, వాసంశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజల ఆస్తులకు భద్రత: సుభాష్




అద్దంపల్లిలో ఇంటింటా ప్రచారంలో సుభాష్, వృద్ధుడికి నమస్కరించి ఓటు అభ్యర్థిస్తున్న సుభాష్, సుభాష్‌కు మద్దతు తెలుపుతున్న ఊడిమూడి సర్పంచ్



ఊడిమూడిలో సుభాష్‌కు హారతులు ఇస్తున్న మహిళలు, సుభాష్‌కు మద్దతు తెలుపుతున్న కుమ్మరి సామాజికవర్గ నాయకులు

కె.గంగవరం, మే5: కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ప్రజల ఆస్తులకు భద్రత ఏర్పడుతుందని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం అద్దంపల్లి, వత్రపూడి, తామరపల్లి, ఊడి మూడి గ్రామాల్లో ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. పలు కూడళ్లలో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తీసకువచ్చిన కొత్త భూహక్కుచట్టం వల్ల కలిగే నష్టాలు వివరించారు. ప్రజలు ఆస్తుల పత్రాలపై జగన్ ఫొటోలు ఎందుకని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ పథకాలు గురించి వివరించారు. సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలి పించాలని కోరారు. నెక్కంటి బాకృష్ణ, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, గన్ని శ్రీనివాస్, జనసేన నాయకులు దేవరపల్లి చక్రి, తాడాల జానకిరామయ్య పాల్గొన్నారు.

కుమ్మరి సంఘీయుల మద్దతు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 5: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రామచంద్రరం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌కు ఆదివారం శాలివాహన (కుమ్మరి) సామాజికవర్గ నాయకులు మద్దతు ప్రకటించారు. రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం మండలాలకు చెందిన కుమ్మరి సంఘం నాయకులు ఆదివారం న్యాయవాది కోటిపల్లి లోవరాజు నివాసంలో ఆత్మీయ సమ్మేళనం జరిపారు. సుభాష్‌కు మద్దతు ప్రకటించారు. రామచంద్రపురం మండల అధ్యక్షుడు మాగాపు శ్రీనివాసరావు, కార్యదర్శి ఏడిద వీరబాబు, కె.గంగవరం మండల అధ్యక్షుడు ఏడిద నాగరాజు, కార్యదర్శి కోటపల్లి వెంకట సుబ్రహ్మణ్యశ్వరరావు, న్యాయవాది కోటిపల్లి లోవరాజు, కుటుంబీకులు, శాలివాహన సంఘం పెద్దలు, సభ్యులు, కొప్పుల సూర్యనారాయణ మద్దతు ప్రకటించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పామర్తి నారాయణమూర్తి పాల్గొన్నారు.